క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్


పవర్ లిఫ్టర్ చంద్రిక

మంగళగిరి: గతనెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కర్నాటక రాష్ట్రం ధావన్ గిరిలో జరిగిన సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో మంగళగిరికి చెందిన బొల్లినేని చంద్రిక 84 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు గుంటూరు జిల్లా అసోషియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధానిలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రికను రాష్ట్ర, జిల్లా అసోషియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మంగళగిరి టౌన్: ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఆటోస్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ విధానం వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరాములు, సుబ్బారావు, నారాయణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోండి



మంగళగిరి టౌన్: మంగళగిరి నగరంలో ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నగర పరిధిలోని ఆంజనేయ కాలనీలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలను విద్యుత్ వినియోగదారులకు వివరిస్తూ కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు. నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఎన్నికలకు ముందు నారా లోకేష్ పగలకొట్టమని చెప్పి. అదే కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

పేగు పురుగులతో అనర్థాలు



ఫిరంగిపురం: పేగు పురుగులతో అనేక అనర్థాలు సంభవిస్తాయని నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని కండ్రిక గ్రామంలో మంగళవారం డీవార్మింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 400 గొర్రెలు, 50 మేకలకు నట్టల నివారణ మందును అందించారు. ఈ సందర్భంగా పీర్ అహ్మద్ మాట్లాడుతూ.. జీవాలకు డీవార్మింగ్ చేయడం ద్వారా ఎదుగుదల బాగుంటుందని అన్నారు. వర్షాకాలం కావడంతో జీవాలు తీసుకునే ఆహారం ద్వారా కడుపులో ఉండే నులిపురుగులు నశించి జీవాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కావున జీవాలకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా తాగించాలని ఆయన కోరారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుడి వార్షికోత్సవం



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని విశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకులు పూర్ణానందశాస్త్రి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నమకచమకాలతో బిల్వదళ పూజలు నిర్వహించారు. విశాలాక్షీ మాతకు అష్టోత్తర, సహస్రనామాలతో కుంకుమార్చనలు చేశారు. అనంతరం కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

మల్టీఫుల్ దోపిడీ

- టికెట్‌తో పాటు తినుబండారాలూ అధికమే
- సినిమా థియేటర్లలో ధరాభారాలు


కూల్ డ్రింక్స్


పాప్‌కార్న్

తాడేపల్లి రూరల్: పని ఒత్తిడి నుంచి ప్రజలు కాస్త ఉపశమనం పొందే వాటిలో సినిమా ఒకటి. రెండున్నర గంటల పాటు తమ ఒత్తిడిని దూరం చేసుకుని ప్రశాంతంగా ఉండేందుకు సినిమాను ప్రేక్షకులు ఎంచుకుంటారు. కుటుంబంతో సరదాగా గడిపేందుకు సినిమా ఉపయోగపడుతుంది. అలాంటి సినిమా ఇప్పుడు వ్యాపారం అయిపోయింది. మల్టీప్లెక్స్ సినిమాల రాకతో థియేటర్ల స్వరూపమే మారిపోయింది. అధిక ధరలతో ప్రేక్షకుడిని నిట్టనిలువుగా దోపిడీ చేస్తున్నారు. టికెట్ ధర నుంచి తినుబండారాల వరకూ అన్నింటి ధరనూ రెండు, మూడింతలు పెంచి ప్రేక్షకుడికి సినిమా చూపిస్తూ మల్టీఫుల్‌గా దోపిడీ చేస్తున్నారు.

గత దశాబ్దం క్రితం వరకూ సాధారణ థియేటర్లుగా ఉన్న వాటిని కార్పొరేట్ వ్యక్తులు లీజుకు తీసుకుని వాటిని మల్టీ ప్లెక్స్‌లుగా మార్చేస్తున్నారు. థియేటర్‌కు అందమైన రంగులు అద్ది కార్పొరేట్ హంగును తీసుకుని వచ్చారు. థియేటర్లు కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తరువాత ఒక్కసారిగా దాని స్వరూపమే మారిపోయింది. ముఖ్యంగా అందులో ప్రదర్శించే సినిమా టిక్కెట్ల ధర, అక్కడ అమ్మే తినుబండారాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న వారు సినిమాకు వెళ్లాలంటే రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్ద హీరోలు నటించిన సినిమాలు విడుదలైన మొదటి వారం వరకూ టిక్కెట్ ధర రూ.600 వరకు నడుస్తోంది. సినిమా బాగుందని ప్రచారంలోకి వస్తే ఈ ధరను మరింత పెంచుతున్నారు. రెండు మూడు రోజుల్లోనే సినిమా నిర్మాణానికి పెట్టిన పెట్టుబడులు మొత్తం రాబట్టుకునేలా ధరలను పెంచేస్తున్నారు.

థియేటర్లలో తినుబండారాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. బయట దొరికే వస్తువులనే మల్టీ ప్లెక్స్‌లలో నాలుగింతలు చేసి అమ్ముతున్నారు. బయట రూ.10 దొరికే పాప్‌కార్న్ థియేటర్‌లలో రూ.100కు.. రూ.20 కూల్‌డ్రింక్‌ను రూ.50కు.. రూ.10 సమోసాను రూ.40కు.. రూ.20 వాటర్ బాటిల్‌ను రూ.40కు విక్రయిస్తూ ప్రేక్షకుడి నడ్డి విరుస్తున్నారు. సినిమా హాళ్లలో ద్విచక్రవాహనం నిలపాలంటే రూ.20, కారు అయితే రూ.50 వసూలు చేస్తున్నారు. ఇక పండుగ దినాలు, సెలవు రోజుల్లో మల్టీ ప్లెక్స్ నిర్వాహకులు ధరలను పెంచి సొమ్ము చేసుకుంటున్నారు.

సౌకర్యాలు నిల్..

మల్టీప్లెక్స్ యాజమాన్యాలు ప్రేక్షకుల నుంచి ముక్కుపిండి ధరలు వసూలు చేస్తున్నా వసతుల కల్పనలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. థియేటర్లలో మరుగుదొడ్లలో కనీస శుభ్రత కూడా పాటించడం లేదు. నీటి వసతి అంతంత మాత్రంగానే ఉంటుంది. ఇక పార్కింగ్ రుసుము రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నా.. వాహనాలు నిలిపేందుకు నీడను ఏర్పాటు చేయడం లేదు. టిక్కెట్ ధరలు, తినుబండారాల ధరలు.. నాణ్యత, భద్రతా ఏర్పాట్లు, ఆహార వస్తువుల నాణ్యత గురించి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార ఉపాధ్యక్షులుగా తాతిరెడ్డి


వైస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న తాతిరెడ్డి

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం ఉపాధ్యక్షులుగా మంగళగిరి నియోజకవర్గం కాజ గ్రామానికి చెందిన బొమ్ము తాతిరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం బొమ్ము తాతిరెడ్డి వైస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్‌లను తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తాతిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తానని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

ఘనంగా గోరేబాబుకు సన్మానం


గోరేబాబును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో వైఎస్సార్ సీపీలో అంచలంచెలుగా ఎదుగుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మహమ్మద్ గోరేబాబును వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం గోరేబాబు పట్టణ అధ్యక్షులు సోమిరెడ్డి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేకా వెంకట రామిరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు షేక్ జావీద్, గుంటూరు జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు(పండు), గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి చిన్నబోతుల దుర్గారావు, తాడేపల్లి ఎస్సీసెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాసరావు మధు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు కూరపాటి ఉదయరాజు తదితరులు పాల్గొన్నారు.

15 అవార్డులు సాధించిన తాడేపల్లి రోటరీ క్లబ్


సర్టిఫికెట్స్ అందుకుంటున్న రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధులు

తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అందించిన విశిష్ట సేవలకు గానూ 15 అవార్డులు సాధించినట్లు క్లబ్ అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ హైందర కన్వెన్షన్‌లో ఇటీవల రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో జరిగిన రోటరీ జిల్లా 3,150 అవార్డుల మహోత్సవంలో 2024–25 సంవత్సరానికి విశిష్ట సేవలందించినందుకు గానూ రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి 15 అవార్డులు, మెమొంటోలు, సర్టిఫికెట్స్ అందుకుందని తెలిపారు. వీటిని ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గవర్నర్ శరత్ చౌదరి చేతుల మీదుగా రోటరీ అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు, డిస్ట్రిక్ట్ చైర్మన్ ఫర్ డయాలసిస్ పరుచూరి కిరణ్‌కుమార్ అందుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు తాడేపల్లి పరిసర ప్రాంతాల్లో అందించిన పలు సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. పూర్వ అధ్యక్షులు జంగాల వెంకటేష్, మున్నంగి వివేకానందరెడ్డి పరుచూరి కిరణ్‌కుమార్‌లు క్లబ్ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ 2024–25 సంవత్సరానికి రోటరీ చేసిన సేవలను గుర్తించి అవార్డులు రావడం సంతోష దాయకమని అన్నారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ జంగాల వెంకటేష్, 3,150 డిస్ట్రిక్ట్ చైర్మన్ ఫర్ డయాలసిస్ పరుచూరి కిరణ్‌కుమార్, సెక్రటరి ఆర్.సుకుమార్ రెడ్డి, రొటేరియన్స్ కాట్రగడ్డ శివన్నారాయణ, రాజేష్, నగేష్, జెట్టి శ్రావణి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవం

తాడేపల్లి రూరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా తాడేపల్లి రూరల్ ఉండవల్లి సెంటర్‌లోని బ్యాంకు శాఖలో వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ట్రెజరర్ వెంకటాచార్యులు కేక్ కట్ చేసి బ్యాంక్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా అందిస్తున్న సేవలు అమోఘమని.. ఈ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో లింగంశెట్టి అసోసియేషన్ ప్రొప్రయిటర్ లింగంశెట్టి కిషోర్, గ్రామ పెద్దలు బుర్రముక్కు భాస్కర్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్

మేడికొండూరు: మండలంలోని నరసరావుపేట రోడ్డులోని డోకిపర్రు యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ సెక్రెటరీ ఫాదర్ పామిశెట్టి బాలస్వామి తెలిపారు. ఇటీవల విడుదలైన పాలిటెక్నిక్ ఎస్టీ టెట్ ఫలితాలలో తమ కళాశాలకు చెందిన పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, నాలుగో సెమిస్టర్‌లో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ.. నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో షేక్ ఫాతిమా 98.4 శాతంతో స్టేట్ ర్యాంకు సాధించిందని.. ప్రథమ సంవత్సరం ఫలితాలలో వి.చంద్రకళ 97.9 శాతంతో మంచి మార్కులు సాధించాలని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కోటిరెడ్డి మాట్లాడుతూ.. మంచి విద్యాబోధనతో ఈ విజయం సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో జోషి, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే

తాడేపల్లి రూరల్: మంగళగిరి పార్క్‌రోడ్‌లోని ఇమ్మానుయేల్ చర్చిలో మంగళవారం ఇండియన్ క్రిస్టియన్ డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాపిటల్ రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ బొంతపురి రవి ప్రకాష్ మాట్లాడుతూ.. క్రీస్తుశకం 52వ సంవత్సరంలో యేసుక్రీస్తు శిష్యులలో ఒకరైన తోమా భారతదేశానికి వచ్చి సేవ చేశారని.. క్రీస్తు ప్రేమను, రక్షణను ప్రకటించారని.. 72వ సంవత్సరం జూలై నెలలో కొందరు దుండగుల చేతిలో యేసు కోసం హత సాక్షి అయ్యి ప్రాణత్యాగం చేశారని అన్నారు. వారిని జ్ఞాపకం చేసుకుంటూ ఇండియన్ క్రిస్టియన్ డే ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు దైవ సేవకులు పిల్లి దయారత్నకుమార్, బేతాళ సాల్మన్‌రాజు, కడియం బుజ్జిబాబు, మాతంగి భాస్కరరావు, గుర్రాల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు రసీదులు తీసుకోవాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష మాట్లాడుతూ.. రైతులు వరి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా రసీదు తీసుకోవాలని అన్నారు. రసీదులో లాట్ నంబరు, విత్తన సంచిపై ఉండే లాట్ నంబర్ ఒకే విధంగా ఉండాలని.. పంట చేతికొచ్చే వరకూ రసీదును భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఏవో శిరీష, ఏసీవో పావని, వీఏఏ అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొరటాలకు నివాళులు

తాడేపల్లి రూరల్: సీపీఎం నాయకులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ 19వ వర్ధంతి వేడుకలను తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరావు మాట్లాడుతూ.. కొరటాల సత్యనారాయణ సామాన్య కార్యకర్త దగ్గర నుంచి ఉన్నతమైన నాయకుడిగా ఎదిగిన ఆయన జీవితం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, ఏపీ కౌలు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, కేవీపీఎస్ తాడేపల్లి మండల నాయకులు నాగపోగు విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

తాడేపల్లి రూరల్: చిర్రావూరు టీడీపీ కార్యకర్త కొండ రామారావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ టీడీపీ తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, నాయకులు నల్లిబోయిన శ్రీనివాసరావు, పిల్లి రమేష్, జెట్టి రవీంద్ర, నల్ల బ్బాయి, సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు మరువలేనివి

తాడేపల్లి రూరల్: రోగులకు వైద్యం అందించే వైద్యుల సేవలు మరువలేనివని సీపీఐ నాయకులు కొనియాడారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని గణేష్ కళామందిర్ వద్ద రామ్ హాస్పటల్‌లోని డాక్టర్ పలగాని శ్రీనివాసరావును నాయకులు కలిసి సత్కరించారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ.. వైద్యులు ఎనలేని సేవలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు, సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, లచ్చి తులసిదాసు, పంచల నాగేశ్వరరావు, పలగాని బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో జాతీయ వైద్యుల దినోత్సవం

దుగ్గిరాల: అవిశ్రాంతంగా పని చేసే వైద్యులను ప్రజలు తప్పకుండా గుర్తిస్తారని డా.ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడానికే మేము ఉన్నామని, ఆరోగ్యపరంగా చికిత్సతో పాటు, సలహాలు, సూచనలు రోగికి ధైర్యం చెబుతామని అన్నారు. అనంతరం డా.అనితతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వి.సుబ్బారావు, భాగ్యలలిత కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


కళ్లకు నల్ల బ్యాడ్జీలు కట్టుకుని నిరసన చేస్తున్న నాయకులు, కార్మికులు

మంగళగిరి టౌన్: ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎంటీఎంసీ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. జీవో 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాల్సి ఉండగా రాష్ట్రంలో కొన్నిచోట్ల రూ.15 వేలు, లేదా రూ.18 వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 4వ తేదీన విజయవాడలో జరిగే సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చెంగయ్య, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ, ఫెడరేషన్ నాయకులు శ్రీనివాసరావు, కేదారనాథ్, ప్రకాష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ మాసోత్సవ ర్యాలీ


వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ అనూష

మంగళగిరి టౌన్: ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయ డెంగీ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా హెల్త్ సెంటర్ మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ వ్యతిరేకతపై ఏఎన్ఎంలు, ఆశాలు, మలేరియా, హెల్త్ సెంటర్ సిబ్బందితో యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అనూష ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ.. డెంగీ బారిన పడిన వారికి తీవ్రమైన జ్వరం, కండరాల నొప్పి, వికారం, వాంతులతో పాటు ముక్కు చెవుల నుంచి రక్తం కారే లక్షణాలు ఉంటాయని అన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ పూజిత, డాక్టర్ రాజేష్, డాక్టర్ ఇందుప్రియ, మలేరియా సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ అమలు చేయాలి


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 210 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారని.. ఎన్నికలకు ముందు నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, పిచ్చయ్య, గురవయ్య, సాంబశివరావు, కార్మికులు సారమ్మ, సువర్ణకుమారి, రమణమ్మ, కాసమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు జరుగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కోరుతూ మంగళవారం తాడేపల్లిలోని గ్రామీణ చైతన్య బ్యాంకు మేనేజర్‌కు సీఐటీయూ, ఏఐటీసీ నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, నీరుడు దుర్గారావు, ఏఐటీసీ నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల వేళ అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్

తాడికొండ: ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కొన్ని మెళకువలు పాటించడం ద్వారా వాటిని సమర్థంగా ఎదుర్కోవచ్చని ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్‌లు ప్రదీప్ కుమార్, వాసుదేవరాజు అన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి విపత్తులపై నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. వరదలు, తుఫాను, భూప్రకంపనలు, భవనాలు కూలిపోవడం వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమకు సమాచారం అందించడం ద్వారా సత్వర సాయం అందుతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మలాకృష్ణ, ఆర్ఐ హనుమంతరావు, పలువురు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళ్లం అధ్యాపకునికి డాక్టరేట్


నాగరాజును అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలంలోని కళ్లం హరనాథరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం సీనియర్ ఫ్యాకల్టీ నాగరాజు పోతులకు రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ రీసెర్చ్ డిగ్రీ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రీసెర్చ్ డిగ్రీ ‘ఏ స్టడీ ఆన్ ది పోర్ట్రేల్ ఆఫ్ దళిత్ స్ట్రగుల్స్ ఇన్ సెలెక్టెడ్ దళిత్ షార్ట్ ఫిక్షన్’ అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించినట్లు చెప్పారు. తమ కళాశాలలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న అధ్యాపకునికి డాక్టరేట్ లభించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి రెడ్డి తెలిపారు. నాగరాజును కళాశాల హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు, కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎల్. మాధవరావులు అభినందించారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ


రైతులకు విత్తన బ్యాగ్‌లు అందిస్తున్న విజయబాబు

దుగ్గిరాల: ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులకు బీమా, సబ్సిడీ వరి విత్తనాలు అందజేస్తున్నట్లు వ్యవసాయ అధికారి మంగళవారం తెలిపారు. కౌలు రైతులకు కార్డులు, సబ్సిడీపై వరి విత్తనాలు బీపీడీ–5204 అందిస్తున్నామన్నారు. కౌలు రైతులకు కార్డుల ద్వారా ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, పంట నష్ట పరిహారం, బీమా సౌకర్యం ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం 25 కేజీల వరి విత్తనాలను రూ.1075కు రైతులకు అందించారు. కార్యక్రమంలో వీఏఏలు లావణ్య, సుధ, రైతు సోదరులు పాల్గొన్నారు.